ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :212 బుధవారం మే 27 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# కశ్మీర్‌పై లష్కరే కొత్త కుట్ర



- పీఓకేలో భారీగా లాంచ్‌ప్యాడ్‌ల విస్తరణ
- వెయ్యి మంది ఉగ్రవాదులతో చొరబాటు యత్నాలు
- పాక్ రాజకీయ నేతలతో రహస్య భేటీలు



న్యూఢిల్లీ, మే 26 (మనప్రజాప్రతినిధి): కశ్మీర్ అంశాన్ని మళ్లీ అంతర్జాతీయ స్థాయిలో రెచ్చగొట్టి భారతదేశంలో అలజడి సృష్టించేందుకు ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా భారీ కుట్రలకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో లాంచ్‌ప్యాడ్‌ల సంఖ్యను పెంచడం, భారీ స్థాయిలో ఉగ్రవాదులను సిద్ధం చేయడం, అదే సమయంలో ప్రచార యుద్ధాన్ని ఉద్ధృతం చేయడం వంటి ద్విముఖ వ్యూహంతో లష్కరే ముందుకు సాగుతున్నట్లు సమాచారం. పాక్ రాజకీయ నాయకులతో లష్కరే అగ్రనేతల వరుస భేటీలు కూడా నిఘా సంస్థల దృష్టిలో పడ్డాయి. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లోకి చొరబడేందుకు పీఓకే సరిహద్దుల్లో దాదాపు ఐదు వందల మందికి పైగా ఉగ్రవాదులు సిద్ధంగా ఉన్నట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల భారత సైన్యం అప్రమత్తంగా వ్యవహరించడంతో చొరబాటు ప్రయత్నాలు వరుసగా విఫలమయ్యాయి. దీంతో తీవ్ర అసహనానికి గురైన లష్కరే నాయకత్వం లాంచ్‌ప్యాడ్‌ల సంఖ్యను మరింత పెంచి ఉగ్రవాదుల సంఖ్యను వెయ్యికి చేర్చాలని నిర్ణయించినట్లు సమాచారం. పీఓకేలో జరిగిన కీలక సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి.భారత భద్రతా దళాలపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా చొరబాటు యత్నాలను మరింత పెంచాలని లష్కరే వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. పహల్గామ్ దాడిలో ఇరవై ఆరు మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనకు లష్కరే అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' కారణమని ఇప్పటికే భద్రతా సంస్థలు నిర్ధారించాయి. అనంతరం భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో మురిద్కేలోని లష్కరే ప్రధాన శిక్షణా కేంద్రం పూర్తిగా ధ్వంసమైంది. ఆ దెబ్బ నుంచి కోలుకునేందుకే ఇప్పుడు సంస్థ మళ్లీ కొత్త వ్యూహాలతో ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.లష్కరే వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ ఇటీవల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు అత్యంత సన్నిహితుడైన రాణా సనావుల్లాతో రహస్య సమావేశం నిర్వహించడం సంచలనం సృష్టించింది. ఈ భేటీలో లష్కరే కొత్త ప్రణాళికలు, నాయకత్వ మార్పులపై చర్చ జరిగినట్లు సమాచారం. హఫీజ్ సయీద్‌ను సిద్ధాంతకర్తగా కొనసాగిస్తూ యువకుడైన తల్హా సయీద్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇక పీఓకే మాజీ ప్రధాని సర్దార్ అతీక్ అహ్మద్ ఖాన్‌తో కూడా తల్హా సయీద్ సమావేశమైనట్లు తెలుస్తోంది. లాంచ్‌ప్యాడ్‌ల విస్తరణకు అవసరమైన మౌలిక వసతులు, రహస్య మద్దతు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం పీఓకేలో అభివృద్ధి లేకపోవడంపై స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో, ఆ వ్యతిరేకతను మళ్లించేందుకు కశ్మీర్ సెంటిమెంట్‌ను మళ్లీ రెచ్చగొట్టాలని లష్కరే భావిస్తున్నట్లు నిఘా అధికారులు విశ్లేషిస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజల దృష్టిని అభివృద్ధి సమస్యల నుంచి మళ్లించడమే అసలు లక్ష్యమని వారు పేర్కొంటున్నారు

# భూసేకరణ సదస్సులో రైతుల ఆవేదన

- -ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూముల సేకరణ
- -కన్నీటిపర్యంతమైన రైతులు
- -జీవనాధారం కోల్పోతామంటూ వేడుకోలు



వికారాబాద్, మే 26 (మనప్రజాప్రతినిధి): వికారాబాద్ జిల్లా దోమ మండలంలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం చేపట్టనున్న భూసేకరణపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సదస్సు ఉద్రిక్త వాతావరణంలో సాగింది. దిరసంపల్లి అనుబంధ గ్రామం అనంతరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను ప్రభుత్వానికి ఇవ్వలేమంటూ పలువురు రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ఐదు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు

2

# ప్రజా పాలనపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం



- -ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సమీక్ష
- -"ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాలపై చర్చ
- -ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా అమలుపై దృష్టి

హైదరాబాద్, మే 26 (మనప్రజాప్రతినిధి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాలపై మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణతో పాటు "ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా" పథకం అమలుపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా చేరవేసే విధానాలపై మంత్రులు, అధికారులు అభిప్రాయాలు వ్యక్తం

2

# భూ బాధితులకు న్యాయం చేయాలని గవర్నర్‌కు వినతి



- -గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన కవిత
- -వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి బాధితుల సమస్యల వివరణ
- -ప్రభుత్వం స్పందించకపోతే మళ్లీ ఉద్యమం హెచ్చరిక

హైదరాబాద్, మే 26 (మనప్రజాప్రతినిధి):తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం లోక్ భవన్‌లో కలిసి భూ నిర్వాసితుల సమస్యలను వివరించారు. ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్‌తో పాటు వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి ప్రాంతాల బాధితులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. భూసేకరణ, ఇండ్ల కూల్చివేత, రహదారి అలైన్‌మెంట్ మార్పుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతలు, ట్రిపుల్ ఆర్ రహదారి అలైన్‌మెంట్ మార్పులు, రాయగిరి భూసేకరణ, పరిగి మండలం కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం జరుగుతున్న భూసేకరణ ప్రయత్నాలపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు కవిత తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించుకుని చర్యలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.గవర్నర్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల ఇళ్లు కూల్చి వారిని మానసికంగా వేధిస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు వంద రూపాయల చీరలు ఇచ్చి కోటీశ్వరులను చేశామంటూ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతల సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కవిత పేర్కొన్నారు. ఒక మహిళకు గర్భస్రావం జరిగిన ఘటన ఇప్పటికీ మర్చిపోలేమని అన్నారు. రైతుల ధాన్యం కొనుగోళ్లు కూడా నిలిచిపోయాయని, రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆవేదనలో ఉన్నారని తెలిపారు. వెంటనే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ట్రిపుల్ ఆర్ రహదారి అలైన్‌మెంట్ నాలుగు

2

# ప్రజా పాలనపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం

మొదటి పేజీ తరువాయి



చేశారు. సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాల అమలు, ప్రజల్లో అవగాహన కల్పించడం, శాఖల సమన్వయం వంటి అంశాలపై పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని నిర్ణయించారు.జూన్ 2 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "ప్రజా పాలన – ప్రగతి నివేదిక" కార్యక్రమాల రూపకల్పనపై సమావేశంలో సమగ్ర చర్చ జరిగింది. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి పేద కుటుంబానికి భరోసా కల్పించే లక్ష్యంతో "ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా" పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అర్హులైన కుటుంబాలకు పథకం ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సి.వి. ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.


# భూ బాధితులకు న్యాయం చేయాలని గవర్నర్‌కు వినతి

మొదటి పేజీ తరువాయి



సార్లు మార్చిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు కవిత తెలిపారు. ఈ అంశంపై గవర్నర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారని చెప్పారు. కేంద్ర మంత్రికి సంబంధించిన లేఖలను కూడా గవర్నర్‌కు చూపించినట్లు వివరించారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తామని, అప్పటికీ బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమ బాట పడతామని కవిత స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్న అన్ని మార్గాల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. భూ నిర్వాసితుల సమస్యలపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

# కోకాపేట చెరువులో ఆక్రమణల తొలగింపు



**– హైడ్రా భారీ ఆపరేషన్**
**– ఇరవై రెండు ఎకరాల ఆక్రమణల గుర్తింపు**
**– ఖైతలాపూర్‌లో రహదారి ఆక్రమణల తొలగింపు**



హైదరాబాద్, మే 26 (మనప్రజాప్రతినిధి): రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట గ్రామంలోని కొత్త చెరువుపై జరిగిన భారీ ఆక్రమణలను హైడ్రా అధికారులు మంగళవారం తొలగించారు. చెరువుల పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో జరిగిన ఆక్రమణలను గుర్తించి కూల్చివేశారు. స్థానికుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టింది. అధికారుల వివరాల ప్రకారం కోకాపేట కొత్త చెరువు మొత్తం ఎఫ్‌టీఎల్ పరిధి డెబ్బై రెండు ఎకరాలు కాగా అందులో దాదాపు ఇరవై రెండు ఎకరాల మేర ఆక్రమణలు జరిగినట్లు గుర్తించారు. కొన్ని నిర్మాణ సంస్థలు చెరువు భూమిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కబ్జా చేసినట్లు తేలింది. గోల్డ్ ఫిష్ విల్లాస్ పేరిట సుమారు ఒకటి పాయింట్ రెండు ఎకరాల మేర ప్లే ఏరియాలు, పార్కులు నిర్మించినట్లు అధికారులు గుర్తించారు.ఫిర్యాదుల ఆధారంగా పూర్తి స్థాయి పరిశీలన అనంతరం మంగళవారం హైడ్రా బృందాలు రంగంలోకి దిగాయి. చెరువు పరిధిలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లు, రేకులతో నిర్మించిన తాత్కాలిక ప్రహరీలను తొలగించారు. చెరువు అసలు హద్దులను నిర్ధారిస్తూ అధికారులు మళ్లీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. చెరువులను కాపాడేందుకు ఇటువంటి చర్యలు కొనసాగుతాయని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. ఇక కూకట్‌పల్లి మండలం ఖైతలాపూర్ ప్రాంతంలో కూడా హైడ్రా మరో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించింది. జ్యువల్ హైట్స్ గేటెడ్ కమ్యూనిటీ ముందు సుమారు వెయ్యి ఏడు వందల గజాల మేర రహదారిని ఆక్రమించినట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించిన హైడ్రా ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించింది.దీంతో మంగళవారం ఉదయం అధికారులు చర్యలు చేపట్టి ఆక్రమణలను తొలగించారు. నిర్మాణ సంస్థకు చెందిన కార్యాలయ గదితో పాటు వెనుక భాగంలో నిర్మించిన పశువుల షెడ్లను కూడా కూల్చివేశారు. ముందుగానే నోటీసులు ఇచ్చి తగిన సమయం కల్పించిన తర్వాతే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజా భూములు, చెరువులు, రహదారుల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హైడ్రా అధికారులు హెచ్చరించారు. చెరువుల పరిరక్షణతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలిగించే అక్రమ నిర్మాణాలపై భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. స్థానికులు హైడ్రా చర్యలను స్వాగతిస్తూ చెరువులను కాపాడినందుకు అధికారులకు అభినందనలు తెలిపారు.



# భూసేకరణ సదస్సులో రైతుల ఆవేదన

మొదటి పేజీ తరువాయి



మొత్తం మూడు వందల ఐదు ఎకరాల భూమిని సేకరించేందుకు సిద్ధమైంది. ఇందులో రెండు వందల తొమ్మిది ఎకరాల పట్టా భూమి, తొంభై ఆరు ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ భూసేకరణ కారణంగా నూట ముప్పై మూడు మంది పట్టా రైతులు, ముప్పై ఏడు మంది అసైన్డ్ భూమి రైతులు ప్రభావితమవుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో రైతులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తమకు ఉన్న కొద్దిపాటి భూమిని కూడా ప్రభుత్వం తీసుకుంటే పిల్లలకు ఏమి ఇవ్వాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న పరిహారం రేట్లతో తాము జీవించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. భూమే తమ జీవనాధారమని, అది కోల్పోతే కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు.ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏ కంపెనీలు వస్తున్నాయో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని రైతులు ఆరోపించారు. పరిశ్రమలు వస్తే తమ ప్రాంతంలో కాలుష్యం పెరిగి వ్యవసాయం పూర్తిగా నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల వల్ల భవిష్యత్ తరాలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు. చుట్టుపక్కల అనేక ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయని, అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని రైతులు అధికారులను కోరారు. తమ భూములను వదిలేయాలని వేడుకున్నారు. భూములు కోల్పోతే గ్రామాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుందని, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని తెలిపారు. రైతుల ఆందోళనల మధ్య అధికారులు భూసేకరణ ప్రక్రియపై వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అయినప్పటికీ రైతులు తమ భూములను కాపాడుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ భూసేకరణ అంశం ప్రస్తుతం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది

# స్వర్ణాంధ్ర విజన్‌పై సీఎం సమీక్ష

**-వ్యవసాయ అనుబంధ రంగాలపై కీలక చర్చ**
**-ఆరు మిషన్ల అమలుపై దృష్టి**
**-క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం**




అమరావతి,మే26(మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన "స్వర్ణాంధ్ర విజన్ 2047"లో భాగంగా ప్రాథమిక రంగాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలక సమీక్ష నిర్వహించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ ఉన్నతస్థాయి సమావేశంలో వ్యవసాయం, హార్టికల్చర్, ఆక్వాకల్చర్, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖలతో పాటు అనుబంధ రంగాలపై విస్తృతంగా చర్చించారు. ప్రాథమిక రంగానికి సంబంధించిన ఆరు మిషన్ల అమలుపై సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించారు. రైతుల

4

# ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం



**-అదానీ,అంబానీ ల కోసం తప్ప ప్రజలకు మోడీ చేసింది ఏం లేదు**

**-జాతీయ రహదారిపై రాస్తారోకో**

**-సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కొంగరి వెంకట్ మావో**



మనప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజక వర్గం:జనగామ నియోజకవర్గం.పెట్రోల్,డీజిల్ ధరలు విపరీతంగా పెంచి కేంద్ర బిజెపి ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుందని,అదానీ,అంబానీ ల కోసం తప్ప ప్రజలకు మోడీ చేసింది ఎం లేదని సిపిఎం సిద్ధిపేట జిల్లా కమిటి సభ్యులు కొంగరి వెంకట్ మావో అన్నారు.మంగళవారం చేర్యాల పాత బస్టాండ్ వద్ద పెంచిన పెట్రోల్,డీజిల్ ధరల ను తగ్గించాలని డిమాండ్ చేస్తు సిపిఎం పార్టీ చేర్యాల మండల & పట్టణ కమిటీల అధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వెంకట్ మావో మాట్లాడుతూ,ప్రధాని నరేంద్ర మోడీ విదేశాల్లో పర్యటనలే తప్పా స్వదేశంలో ప్రజలు పడుతున్న బాధలను పట్టించుకోవడం లేదని అన్నారు,వారంలో నాలుగు సార్లు పెట్రోల్,డీజిల్ పెరిగాయని,మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత విపరీతంగా ధరలు పెంచి ప్రజలకు వాతలు పెట్టడం అన్యాయామన్నారు.పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ధరలు పెంచుతున్న మోదీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ఆయన డిమాండ్ చేశారు.అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్న కూడా దేశంలో బీజేపీ ప్రభుత్వం పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలను తగ్గించాల న్నారు.చమురు కంపెనీలు నష్టాలలో ఉన్నాయని పెట్రోల్ ధరలు పెంచుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు.పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన ప్రధాని నరేంద్ర మోడీ అంబానీ,అదానీలకు అనుకూలంగా పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి కైన పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు,లేనిచో సిపిఎం పార్టీ అధ్వర్యంలో ప్రజలందరినీ ఏకం చేసి ఆందోళన,పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్,చుంచనకోట సర్పంచ్ గొర్రె శ్రీనివాస్,పట్టణ కమిటి సభ్యులు అముదాల నర్సిరెడ్డి,ముస్త్యాల ప్రభాకర్,మండల కమిటి సభ్యులు నాగపురి కనకయ్య,మోకు ఇంద్రసేనరెడ్డి,స్వర్గం శ్రీకాంత్,నాయకులు నంగి మైస్సయ్య,తుప్పతి రాజు,పండుగ యాదగిరి,ఆవుల చంద్రయ్య,గుండ్ర రవీందర్,గుడ్ల రవి,యాడారం బ్రహ్మయ్య,చింతకింది డానియల్,తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో షాట్ సర్క్యూట్






మన ప్రజాప్రతినిధిదినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. షాట్ సర్క్యూట్ కారణంగా కార్యాలయంలోని బ్యాటరీ ఇన్వర్టర్ పేలి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన సంఘటన చేర్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోటు చేసుకుంది.మంగళవారం ఉదయం రోజువారీ మాదిరిగా కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పనుల్లో సిబ్బంది నిమగ్నమై ఉండగా షాట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా బ్యాటరీ ఇన్వర్టర్ పేలి శబ్దం రావడంతో సిబ్బంది ఉలిక్కి పడ్డారు.షాట్ సర్క్యూట్ కారణంగా కార్యాలయంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కంప్యూటర్లు కూడా ప్రాబ్లం రావడంతో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో ఆరు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.ఇదే విషయమై సబ్ రిజిస్టర్ మనోహర్ నీ వివరణ కోరగా ఈరోజు ఉదయం విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని దాని వలన కార్యాలయంలో కంప్యూటర్ లు ప్రాబ్లం వచ్చాయని ఒకటి రెండు రోజుల్లో మొత్తం రిపేరు చేయించి కార్యాలయంలో సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని అన్నారు.

# బక్రీద్ సందర్భంగా పీస్ మీటింగ్ ఏర్పాటు చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా,డీసీపీ రాజమహేంద్ర నాయక్ మరియు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో రాబోయే బక్రీద్ పండగ కోసం జరిగిన పీస్ మీటింగ్ ఏర్పాటులో పాల్గొన్న రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ చిలువేరు అభి గౌడ్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామలో అందరూ కూడా ఎప్పుడూ సోదర భావంతో కలిసి మెలిసి ఉన్నారు ఇకపైన కూడా అలాగే ఉండాలని సూచించారు.ముస్లిం సోదరులు మాట్లాడుతూ గోవధ మేము చేయమని చెబుతూ వారి తరపున ప్రభుత్వానికి అధికారులకు జాతీయ జంతువుగా గోమాతను పెట్టాలని కోరడం చాలా అందననీయం.గోవధ చేయకుండ ఉండాలని అధికారులు సూచించడం తో పాటు చేస్తే కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ,గోవధ చేయడానికి అధికారుల సూచన పద్నాలుగు సంవత్సరాలు నిండి రేప్రొడక్టివ్ లేని వాటికి అధికారులు పర్యవేక్షించి ధృవీకరణ పత్రం ఇస్తే మాత్రమే చేయాలని సూచించారు.ఈ నియమాలను అధికారులు,ప్రజలు అందరూ తెలుసుకొని పాటించాలని లేని యెడల చట్టరీత్య కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ అడ్వాన్స్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



# జనగణనకు ప్రజలందరూ సహకరించాలి



మన ప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం. భారత జనగణన 2027 లో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా జన గణన ప్రధాన అధికారి గారి ప్రత్యేక ఆదేశాలతో జిల్లా సమాచార పౌర సంబంధాల సమాచార శాఖ ఏడి.ఆదేశాలతో మంగళవారం రోజున చేర్యాల పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద పట్టణంలో ప్రజలను చైతన్యం చేయటం జరిగింది.మే 11 న జిల్లాలో జనగణన మొదలయ్యిందని జూన్ తొమ్మిది వరకు ఈ గణన కొనసాగుతుందని ప్రజలందరూ ఇంటికి వచ్చే ఎమ్యూనరేటర్ లకు సహకరించాలని కళాంజలి రాజేష్ బృందం పాటల ద్వారా వివరించారు.ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముస్త్యాల అరుణ బాల్ నర్సయ్య మాట్లాడుతూ ముందుగ ఇండ్ల లెక్కింపు చేస్తారని అనంతరం ప్రజల లెక్కింపు ఉంటుందని పాటల ద్వారా వివరించారు.అంతే కాకుండా ప్రస్తుతం డిజిటల్ జనగణన లో జరుగుతుందని అన్నారు.ఇంటి వివరాలు,కుటుంబ వివరాలు,వృత్తి,వ్యాపారం,వంటి అంశాలపై అధికారులకు సహకరించి అడిగే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అందించాలని కోరారు. పాల్గొన్నారు.ఇట్టి కార్యక్రమంలో వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా,మున్సిపల్ కమిషనర్ నాగేందర్,కౌన్సిలర్లు సదానందం సుప్రజ, పోతుగంటి ప్రసాద్, ఖాజా,కొమ్ము నర్సింగా రావు,మేనేజర్ ప్రభాకర్,ఆర్ ఐ.కృష్ణ,మరియు ఆర్ పి లు,పాల్గొన్నారు.

# మల్లన్న స్వామికి వెండి పాత్రలు అందజేసిన భక్తులు



మనప్రజాప్రతినిధి దినపత్రిక, కొమురవెల్లి, జనగామ నియోజక వర్గం:జనగామ నియోజకవర్గం శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవాలయానికి సికింద్రాబాద్ వాసవి నగర్ కు చెందిన తమ్మన గోపాలరావు మహాలక్ష్మి దంపతులు ఒక కేజీ వెండి పాత్రలు,(రెండు వెండి పళ్లెం లు) స్వామివారి దేవాలయానికి సమర్పించారు.దేవాలయ కార్యాలయం లో కార్యనిర్వాహణాధికారి కృష్ణ ప్రసాద్ కి అందజేసి తగు రసీదు పొందారు.ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం స్వామివారి శేష వస్త్రములు మరియు ప్రసాదం అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్,ఏ ఈ ఓలు.బుద్ధి శ్రీనివాస్,రావుల సుదర్శన్, పర్యవేక్షణకులు చంద్రశేఖర్,అకౌంటెంట్ దేశపతి శంకర్,జూనియర్ అసిస్టెంట్ మధుకర్,తదితరులు ఉన్నారు.

# మాదిగ కుల పెద్దమనిషిగా కర్రె శ్రీను ఎన్నిక



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,బచ్చన్నపేట, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. బచ్చన్నపేట గ్రామ మాదిగ కుల పెద్ద మనిషిగా కర్రె శ్రీను ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నికైన కర్రె శ్రీనుకి పలువురు పెద్ద మనుషులు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది....ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన శ్రీను మాట్లాడుతూ మీరు నాకు ఇచ్చినటువంటి ఈ పదవికి న్యాయం చేస్తారని మాదిగ కులానికి గ్రామంలో మంచి పేరును తీసుకొస్తారని అందరికి ఆదర్శంగా ఉంటానని అత్యవసర సమయాలలో అందరికీ అందుబాటులో ఉండి మన ఊరికి మన కులానికి మంచి పేరు తెస్తానని తెలిపారు.కార్యక్రమంలో గంధముల జంపయ్య,పైసా రాజశేఖర్,అల్వాల గాలయ్య,రాగి చెట్టి అబ్బ సాయిలు, భావన్లపల్లి యాదగిరి,పైసా బిక్షపతి,కర్రె వెంకటయ్య,అల్వాల ఇస్తారి,కర్రె బాస్కర్,అల్వాల అనిల్,మహేందర్,గంధ మల్ల భాస్కర్,కర్రె నవీన్,అల్వాల సిద్ధి మల్లయ్య,పైసా చంద్రశేఖర్,గణేష్, రవికుమార్,మహేష్, చంద్రం,అల్వాల పరుశరాములు,అంజయ్య,లక్ష్మణ్,పరశురాములు,కర్రె శ్రీనివాస్,గుడ్ల మనోహర్,పోచయ్య, మైపాల్,పైసా కిష్టయ్య,కర్ర నరసయ్య,నరేష్,అల్వాల రాజు,తదితరులు పాల్గొన్నారు.


# సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిది



మంగళవారం రోజు గ్రామ సర్పంచ్ బొమ్మ మల్లయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారునికి అందజేశారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ మాధవి సుధాకర్,వార్డు మెంబెర్స్ కొంతం శ్రీనివాస్, సీత యాదగిరి,మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, వుండే మహిపాల్ రెడ్డి బొమ్మ నర్సిములు,నాంగి స్వామి, రవి,చుక్క బీరయ్య, రాజు,చిట్యాల బాపూరాజు,వీరం రెడ్డి, బాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోదీ నాయకత్వంలో నూతన భారత్

న్యూఢిల్లీ, మే 26 (మనప్రజాప్రతినిధి): 2014 మే 26 భారత రాజకీయాల్లో కేవలం అధికార మార్పిడి మాత్రమే కాదని, దేశ మార్పుకు నాంది పలికిన చారిత్రాత్మక ఘట్టమని కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు కింజరాపు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పన్నెండు సంవత్సరాల్లో భారత్ ఎన్నడూ చూడని స్థాయిలో అభివృద్ధిని సాధించిందని తెలిపారు. ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విప్లవం, బలమైన జాతీయ ఆత్మవిశ్వాసం, నిర్ణయాత్మక నాయకత్వంతో దేశం కొత్త దిశగా పయనించిందని రామ్ మోహన్ నాయుడు పేర్కొన్నారు. “ఆత్మనిర్భర్ న్యూ ఇండియా” రూపుదిద్దుకోవడంలో ప్రధాని మోదీ పాత్ర కీలకమని కొనియాడారు. దేశ యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన నాయకత్వం మోదీదేనని అభిప్రాయపడ్డారు. ఈ మార్పు యువత ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని ఆయన తెలిపారు. భారత యువత ఇప్పుడు పెద్ద కలలు కనడమే కాకుండా ప్రపంచ స్థాయిలో నాయకత్వం వహించగలమనే నమ్మకంతో ముందుకు సాగుతోందన్నారు. పరిమితులను కాకుండా అవకాశాలను చూసే తరం తయారైందని పేర్కొన్నారు.దేశ నిర్మాణంపై ప్రధాని మోదీకి ఉన్న అంకితభావం, ప్రజలపై ఉన్న నమ్మకం దేశంలోని ప్రతి మూలకు ఆత్మవిశ్వాసాన్నితీసుకెళ్లిందన్నారు. దూర ప్రాంతాలు కూడా ఇప్పుడు దేశ అభివృద్ధి కథలో భాగమవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి ప్రయోజనాలు



చివరి వ్యక్తి వరకు చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గతంలో విధానాల స్తబ్ధతతో ఉన్న భారత్ ఇప్పుడు సంస్కరణలు, పనితీరు, మార్పు అనే సిద్ధాంతాలతో ముందుకు సాగుతోందని రామ్ మోహన్ నాయుడు అన్నారు. “రీఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్” మంత్రంతో దేశం భవిష్యత్‌కు సిద్ధమవుతోందని పేర్కొన్నారు. పారదర్శకత, వేగం, సేవాభావంతో అభివృద్ధి కొనసాగుతోందన్నారు.ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని ఆయన తెలిపారు. ఆత్మవిశ్వాసం, స్వావలంబన, సేవాభావం, ఆశయాలతో ముందుకు సాగుతున్న నూతన భారతాన్ని చూస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమం




నేరేడుచర్ల //(మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి షేక్ యూసుఫ్ అధ్యక్షతన లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు రావులపల్లి ప్రసాద్ వారి కుమారుడు రావులపల్లి మోహన్ దీపిక దంపతుల వివాహ దినోత్సవ సందర్భంగా అల్పాహార వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ బట్టు మధు, చల్లా ప్రభాకర్ రెడ్డి, ఎడవల్లి సత్యనారాయణ రెడ్డి హాజరై మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు బడుగు బలహీన వర్గాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి తమ వంతు సహాయం అందించడంలో క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రతి సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్న రావులపల్లి ప్రసాద్ గారిని అభినందిస్తూ, వారి కుమారుడు మోహన్ మరియు కోడలు దీపిక దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని పేర్కొంటూ ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహమ్మద్ అబ్దుల్ కలీం, లయన్స్ క్లబ్ కోశాధికారి సరికొప్పుల నాగేశ్వరరావు, సీనియర్ సభ్యులు కందిబండ శ్రీనివాస్ రావు, సైదా నాయక్, లాయర్ విశ్వనాథం షావయ్య, బాల వెంకటేశ్వర్లు, మూలగుండ్ల వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐదవ రోజుకు చేరిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం



నేరేడుచర్ల //(మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ): 5వరోజు వాసవి క్లబ్ వనితా క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం దగ్గర మజ్జిగ పెరుగన్నం కూల్ వాటర్ పంపిణిచైయనైనది. ఇట్టికార్యక్రమానికి ఈరోజు దాతలుగా క్రీస్తు శేషులు నీలా శంభయ్య. వారి జ్ఞాపకార్థం ధర్మపత్ని కరుణ. కుమారుడు గోపి ప్రవల్లిక దంపతులు. ఇట్టి కార్యక్రమాములో పాల్గొన్నవారు వాసవి క్లబ్ ప్రెసిడెంట్ నీలా రామ్మూర్తి. సెక్రటరీ చెరుకు రాము .ట్రెజరర్ చారాగుండ్ల వెంకటేశ్వర్లు. మరియు కొత్త లక్ష్మణ్. వుటుకురి నటరాజు. కందిబండ శ్రీనివాసరావు. ఉప్పల పుల్లయ్య .నిల శ్రీనివాస్. గుంటూరి శ్రీనివాసు. జూలూరి అశోక్ .తాళ్లూరి శ్రీనివాస్ .అనంతుల సత్యనారాయణతదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర విజన్‌పై సీఎం సమీక్ష

తరువాయి భాగం



ఆదాయం పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, ఉత్పత్తుల విలువ ఆధారిత ప్రాసెసింగ్, ఎగుమతుల పెంపు వంటి అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు.సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆయా శాఖల ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు. ప్రతి శాఖకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను సమీక్షిస్తూ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. హార్టికల్చర్, ఆక్వాకల్చర్, పాడి పరిశ్రమల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచాలని సూచించారు. రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు, నిల్వ కేంద్రాలు, ఎగుమతి అవకాశాలు మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని



సీఎం పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశం ద్వారా రాష్ట్రంలోని వ్యవసాయ అనుబంధ రంగాలకు మరింత ప్రాధాన్యం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతులు, మత్స్యకారులు, పశుసంవర్ధక రంగాలపై ఆధారపడిన కుటుంబాలకు కొత్త అవకాశాలు సృష్టించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం.

# మసాయిపేట్ లో ఉచిత మెగా కంటి శిబిరం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 26:నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో మాసాయిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల లో ఉచిత మెగా కంటి శిబిరం ఘనంగా నిర్వహించరు ఈ కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొని ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన ప్రజలకు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు వైద్యులచే ప్రత్యేక సలహాలు అందజేశారు. అవసరమైన వారికి అద్దాలు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, వృద్ధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ అవకాశాన్ని 400 మందికి పైగా వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం తమకు అత్యంత ముఖ్యమని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మాణం కోసం రోడెక్కిన గ్రామస్తులు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 26:బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ వల్లూరు గ్రామస్తులు మంగళవారం జాతీయ రహదారి-44పై ఆందోళనకు దిగారు. ప్రమాదకరంగా మారిన క్రాసింగ్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహించిన గ్రామస్తులు,సుమారు అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. గ్రామస్తుల ఆందోళనతో హైదరాబాద్, కామారెడ్డి వైపు భారీగా వాహనాలు నిలిచిపోయాయి.విషయం తెలుసుకున్న నార్సింగి ఎస్ సృజన సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి పరిస్థితినిఅదుపులోకి తీసుకొచ్చారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. వల్లూరు క్రాసింగ్ వద్ద బ్రిడ్జి లేకపోవడం వల్ల గ్రామానికి వెళ్లే ప్రజలు,నిత్యం ప్రాణాల పణంగా పెట్టి రహదారి దాటాల్సి వస్తోందన్నారు.ఇప్పటివరకు ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోయి బాధిత కుటుంబాలు అనాథలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నప్పటికీ,బ్రిడ్జి నిర్మాణంపైస్పష్టతఇవ్వకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామం వద్ద బ్రడ్డి నిర్మాణానికి హామీ ఇచ్చే వరకు రోడ్డువిస్తరణ పనులుకొనసాగనివ్వమని గ్రామస్తులుహెచ్చరించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వల్లూరు క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందుతులు అరెస్టు



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్టు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.మంగళవారం టేకులపల్లి వంతెన వద్ద ఎస్సై వి. రమేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను అదుపులోకి తీసుకోని విచారించగా గత కొంతకాలం నుండి ఖమ్మంలో రెండు మోటార్ సైకిల్, రెండు ఆటోలు దొంగిలించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారుగా 3,30,000 ఉంటుందని తెలిపారు. ఖమ్మం బైపాస్ రోడ్ లో సిపిఐ ఆఫీస్ వద్ద ఒక మోటార్ సైకిల్ ను రెండవది ఖమ్మం బాలాజీ నగర్ లో లిటిల్ స్టార్ హాస్పిటల్ వద్ద ఒక ఆటోను, మూడోది ఖమ్మం బ్రాహ్మణ బజార్లో ఒక ఇంటి ముందు ఉన్న పల్సర్ మోటార్ సైకిల్ ను, మరియు ఖమ్మం నెహ్రూ నగర్ లో ఎం ఎన్ ఆర్ హాస్పిటల్ ముందు ఆగి ఉన్న ఒక ఆటోను దొంగిలించామని నేరాన్ని అంగీకరించారని పేర్కొన్నారు.నిందితులు ఖమ్మం పెద్ద తండాకు చెందిన ఆటో డ్రైవర్లైన నునావత్ సాయికుమార్, బానోత్ సాయికుమార్, వియం బంజరకు చెందిన రేపల్లి శ్రీను అలియాస్ రాజు ఇతని పై గతంలో కూడా ఖమ్మం ఒకటవ టౌన్ పరిధిలో రెండు దొంగతనాలు చేశాడని తెలిసింది. రెండు ఆటోలు, రెండు మోటార్ సైకిల్ ను స్వాధీనపరచుకొని వారిని అరెస్టు చేసి కోర్టు నందు హాజరు పరిచినట్లు తెలిపారు.

# పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి




**-పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి**

**-విధుల్లో క్రమశిక్షణతో వ్యవహరించాలి**

**-చిన్న శంకరంపేట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మెదక్ ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**

మన ప్రజాప్రతినిధి తెలుగు దిన పత్రిక చిన్న శంకరంపేట్ పోలీస్ స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ.. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం లేకుండా సమయపాలనతో విధులు నిర్వహించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలపై కూడా ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ.. ముఖ్య కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చూడాలని అధికారులకు సూచించారు. నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసి నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. స్టేషన్ రిసెప్షన్‌ను పరిశీలించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న రెమావతి ని ఆమె బాధ్యతల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా నిలుస్తూ, వారి ఫిర్యాదులను సక్రమంగా రాయించడంలో సహకరించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సహాయం అందించాలని తెలిపారు.అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ.. విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఎస్పీ వెంట సీఐ లు సైదా, సందీప్ రెడ్డి, ఎసై శివనందం సిబ్బంది ఉన్నారు

# బ్లూ స్టార్ ఈవెంట్స్ పురస్కారం రాష్ట్రీయ దివ్య ప్రతిభా సమ్మాన్' కు మీర్ గియాసుద్దీన్ ఎంపిక

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, మే 26 : చేగుంట మండలం, మెదక్ జిల్లాకు చెందిన ప్రముఖ సామాజిక సేవా నిర్వాహకులు వడియారం గ్రామం మీర్ గియాసుద్దీన్ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. బ్లూ స్టార్ ఈవెంట్స్ సంస్థ దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన ప్రముఖులకు అందజేసే "రాష్ట్రీయ దివ్య ప్రతిభా సమ్మాన్ - 2026" అవార్డుకు తెలంగాణ రాష్ట్రం నుండి ఆయనను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించారు. మీర్ గియాసుద్దీన్ సమాజంలో వెనుకబడిన, ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగుల శ్రేయస్సు కోసం అందిస్తున్న "దివ్యాంగ్ సేవ"లను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఆయన నిరంతర అంకితభావం, సమాజంపై ఆయన చూపిన సానుకూల ప్రభావాన్ని అభినందిస్తూ సంస్థ ప్రతినిధులు ఎంపిక లేఖను అందజేశారు. మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తికి ఈ జాతీయ స్థాయి గుర్తింపు దక్కడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు సామాజిక వేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ మీర్ గియాసుద్దీన్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



# బ్యాడ్మింటన్ లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించిన పోలీస్ కమిషనర్



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంపోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ శిక్షణతో రాణిస్తున్న పోలీస్ పిల్లలు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 23,24 తేదీల్లో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్ -11,13 జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - 2026 సింగిల్స్, డబుల్స్ పోటీలలో ప్రతిభ చూపి 12వ యోనెక్స్-సన్‌రైజ్ తెలంగాణ రాష్ట్ర సీనియర్, సబ్-జూనియర్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్లకు అర్హత సాధించిన క్రీడాకారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఇటీవల రాష్ట్ర డీజీపీ నూతనంగా ప్రారంభించిన పోలీస్ స్పోర్ట్స్ కంప్లెక్స్ లో బ్యాడ్మింటన్ శిక్షణ పొందిన పోలీస్ సిబ్బంది పిల్లలు ఇస్లావత్ కీర్తిష్, (వి.నిశాంత్,వి.శ్రీ మేధాన్షా, (టి.మనోజ్,వి.రోహిత్ సీనియర్ విభాగం మరియు కోచ్ లు ) జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ లో ప్రతిభ చూపటం అభినందనీయమన్నారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని అన్నారు. బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించి క్రీడల్లో రాణిస్తున్న పోలీస్ స్పోర్ట్స్ కంప్లెక్స్ ను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నారా? డయల్ 100 కి కాల్ చేయండి!




మనప్రజాప్రతినిధులు దినపత్రికి సూర్యాపేట జిల్లా:సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం డయల్ 100 మెరుపు స్పందనసగటున 10 నిమిషాల్లో బాధితులకు పోలీస్ సేవలు డయల్ 100 ఫిర్యాదులపై సూర్యాపేట పోలీసుల మెరుపు స్పందన సగటున 10 నిమిషాల్లోనే బాధితుల వద్దకు చేరిక సూర్యాపేట జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ డయల్ 100 పిర్యాదులపై జిల్లా పోలీసు యంత్రాంగం అత్యంత వేగంగా స్పందిస్తోంది. ఆపదలో ఉన్న బాధితులు డయల్ 100కు కాల్ చేసిన వెంటనే పోలీసులు నిమిషాల వ్యవధిలో వారి వద్దకు చేరుకుని అవసరమైన సేవలు అందిస్తున్నారు. కేవలం 10 నిమిషాల్లోనే స్పందన:లి జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నిన్న (సోమవారం) వచ్చిన డయల్ 100 ఫిర్యాదులపై పోలీసు సిబ్బంది రికార్డు స్థాయిలో స్పందించారు. కాల్ వచ్చిన సగటున 10 నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలాలకు చేరుకుని, బాధితులకు తక్షణ సహాయం అందించి అండగా నిలిచారు.నిరంతరం అందుబాటులో ప్రత్యేక బృందాలు:లి డయల్ 100 కాల్స్ పై తక్షణమే స్పందించి బాధితులకు సేవలు అందించడానికి జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజు ప్రత్యేకంగా 3 నుండి 5 బృందాలు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నాయి. బ్లూ కోట్స్ మరియు పెట్రో కార్ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అత్యంత వేగంగా స్పందిస్తున్నారు. సిబ్బందికి నిరంతర శిక్షణ:లి డయల్ 100 కాల్స్ పై స్పందించడంలో సిబ్బంది సామర్థ్యాన్ని, పనితీరును మరింత మెరుగుపరచడానికి ఎప్పటికప్పుడు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆధునిక కాలానికి అనుగుణంగా బాధితులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పోలీసు సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నాం. ప్రజలు అత్యవసర సమయాల్లో ఎలాంటి సంకోచం లేకుండా డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నాము.బాధితుల ఇంటి వద్ద నుండి కేసులు నమోదు చేస్తున్న సూర్యాపేట జిల్లా పోలీస్..బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే సంఘటనలపై బాధితుల ఇండ్లకు వెళ్లి ఫిర్యాదు స్వీకరించి ఇంటి వద్ద నుండే కేసు నమోదు చేస్తున్న సూర్యాపేట జిల్లా పోలీస్. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బాధితుల ఇంటి వద్ద నుండే కేసు నమోదు, ఎఫ్ఐఆర్ ఎట్ డోర్ స్టెప్ కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ పటిష్టంగా ముందుకు తీసుకెళ్తూ బాధితులకు ఇంటివద్దే పోలీసు సేవలు అందించడం జరుగుతుంది.మహిళల బాలల వృద్ధుల పట్ల ఆకృత్యాలు జరిగినప్పుడు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, దొంగతనాలు జరిగినప్పుడు, వ్యక్తులపై భౌతిక దాడులు జరిగినప్పుడు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఆకృత్యాలు జరిగినప్పుడు, విద్యాసంస్థల్లో ర్యాగింగ్ జరిగినప్పుడు, బాల్య వివాహాలు జరిగే సమయంలో సమాచారం అందుకున్న వెంటనే బాధితుల ఇంటి వద్ద లేదా వారికి అనుకూలమైన ప్రదేశంలో ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి కేసు పత్రాన్ని బాధితులకు అందజేస్తున్నాము.

# రోడ్డు ప్రమాదంలో దళిత యువకుడి మృతి





మనప్రజాప్రతినిధిదినపత్రిక,బచ్చన్నపేట,జనగామ నియోజక వర్గం:జనగామ నియోజకవర్గం బచ్చన్నపేట మండలం, బసిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మల్లయ్య కుమారుడు,నల్ల వెంకటేష్ (24) నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించారు.ఈ వార్త తెలియగానే గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.ఈ విషాద ఘటనపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్,తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.వారు వెంటనే బసిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకుని,వెంకటేష్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి,వారిని ఓదార్చారు.వెంకటేష్ అకాల మరణం పట్ల తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ,ఈ కష్ట సమయంలో కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు నూకల.బాల్ రెడ్డి,బసిరెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు బాలగోని కనుకయ్య,ఎంపీటీసీ నీల రమేష్,బండనాగారం సర్పంచ్ ఇజ్జగిరి రాములు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నల్ల మహేందర్,జిల్లా నాయకులు సందీప్,జిల్లా కాంగ్రెస్ ఈసి మెంబెర్ లింగాల.రాజేందర్ రెడ్డి,తదితర సీనియర్ నాయకులు ఎద్దు హారీష్,కొండ హరికృష్ణ, నిమ్మ కర్ణాకర్ రెడ్డి,చల్లా సురెందర్ రెడ్డి,అక్కిరెడ్డి శ్రీధర్,గంగరబోయిన మహెందర్,చిరంజీవి,గంగరబోయిన ఐలయ్య,తదితరులు పాల్గొన్నారు.

# బోరు మోటార్లు వైర్ల దొంగతనం కేసులో ఒక వ్యక్తి అరెస్ట్




మన ప్రజాప్రతినిది తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:చింతకాని పోలీస్ స్టేషన్ ఖమ్మంజగన్నాధపురం మరియు పందిళ్ళపల్లి గ్రామ శివార్లలోని పంట పొలాల్లో రైతులు ఏర్పాటు చేసిన బోరు మోటార్ల వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు రైతులు ఫిర్యాదు చేయగా, దానిపై చింతకాని పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది.మంగళవారం రోజు నామవరం ఎక్స్ రోడ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న శీలం నాగరాజు, తండ్రి వెంకన్న నివాసం జగన్నాధపురం గ్రామం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, తాను మద్యం సేవించడం మరియు జల్సాలకు అలవాటు పడి ఈ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు.అతని వద్ద నుండి దొంగతనం చేసిన వైర్లను కాల్చి పొందిన సుమారు 3.3 కిలోల కాపర్ వైర్ మరియు వాటిలోంచి కొంత వైరు అమ్మగా వచ్చిన రూ.20,000/- నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి మంగళవారం రోజు రిమాండ్కు తరలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్సై వీరేందర్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

# మీ జేబుకు చిల్లు పడకుండా, ప్రాణం నిలబెట్టే దేవాలయం బీబీనగర్ ఎయిమ్స్



"అమ్మా, ఆపరేషన్కు 5 లక్షలు కావాలి" అనే మాట ఇక వినబడదు. ఎందుకంటే మన బీబీనగర్ లో తెలంగాణ లో ఎయిమ్స్ ఉంది.ఒక పేద తండ్రి కూతురి పెళ్లి కోసం దాచిన డబ్బు, ఒక తల్లి కొడుకు చదువు కోసం కూడబెట్టిన సొమ్ము ఒక్క జబ్బు పేరు చెప్పి కార్పొరేట్ హాస్పిటల్ లాగేసుకుంటుంది. ఇక ఆ బాధలు వద్దు. హైదరాబాద్ - యదాద్రి మధ్య, 200 ఎకరాల పచ్చని ప్రాంగణంలో, కేంద్ర ప్రభుత్వం రూ. 2000 కోట్లతో కట్టించిన మన ఎయిమ్స్ మనందరి కోసం ఎదురుచూస్తోంది.మీరు ఎందుకు వెంటనే వెళ్లాలి?ఇది చదవండి, మీ కళ్ళు మీరే నమ్మరు.1. డాక్టర్ ఫీజు ఎంత అంటే ఒక్క టీ ఖరీదు కూడా కాదు: కేవలం ₹10/-అవును సార్, కేవలం పది రూపాయలు. ఆ ఒక్క టికెట్తో మీరు జనరల్ ఫిజీషియన్ దగ్గర, కీళ్ల డాక్టర్ దగ్గర, కంటి డాక్టర్ దగ్గర, జుచీ డాక్టర్ దగ్గర, పంటి డాక్టర్ దగ్గర, చర్మవ్యాధుల డాక్టర్ దగ్గర అందరి దగ్గరా చూపించుకోవచ్చు. బయట ఒక స్పెషలిస్ట్ ఫీజు ₹500 నుండి ₹1500. ఇక్కడ మాత్రం₹10. ఆలోచించండి, మీ 490 రూపాయలు మిగిలినట్టే.2. బయట ₹10,000 అయ్యే టెస్టులు ఇక్కడ ₹600 లోపేమీరు షాక్ అవుతారు, కానీ ఇది నిజం. కార్పొరేట్ హాస్పిటల్ బిల్లు చూసి గుండె ఆగిపోయే పరిస్థితి ఇక్కడ ఉండదు.మీకు బయట అయ్యే ఖర్చు ఎయిమ్స్లో అయ్యే ఖర్చు మీక మిగిలేదికంప్లీట్ బ్లడ్ టెస్ట్: ₹800₹135₹665లివర్ & కిడ్నీ టెస్ట్:₹2000225 + 225₹1550జుజ+ + చెస్ట్ X`Ray: ₹700 50 + 60590 థైరాయిడ్ టెస్ట్: ₹900 ₹200 ₹700మామ్మోగ్రఫీ: ₹4000 ₹630 ₹3370ఒక్కరోజులో ₹6000 కు పైగా ఆదా. ఆ డబ్బుతో మీ పిల్లలకు ఒక నెల సరుకులు వస్తాయి సార్.3. ఇది హాస్పిటల్ కాదు, ఫైవ్ స్టార్ హోటల్లాగావుంటుంది200 ఎకరాల్లో పచ్చదనం మధ్య ఉన్న హాస్పిటల్. గాలి, వెలుతురు, పరిశుభ్రత. బాత్రూమ్ నుండి బెడ్ వరకు అద్దంలా మెరుస్తూ ఉంటుంది. క్యాంటీన్లో వేడి వేడి అన్నం, కూర, పప్పు, పెరుగు అన్నీ కలిపి కేవలం ₹75. బయట హోటల్లో ఒక ప్లేట్ మీల్స్ కూడా రాదు ఈ రేటుకి.4. వెళ్లడం చాలా ఈజీ జేబుకు భారం కాదులిస్త్రీలు ఫ్రీ.బస్సు పురుషులు Uppal to -బీబీనగర్, 50.00 gents fare స్త్రీలు ఉచితబస్సు వరంగల్ బస్ స్టాండ్ నుండి హైదరాబాద్ డైరెక్ట్ బస్సులు బీబీనగర్ ఎయిమ్స్ 150.00ఉదయం 7గంటలకు వెళ్తే, టెస్టులతో సహా అన్నీ అయిపోయి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి వచ్చేస్తారు. ఆఫీసుకు సెలవు పెట్టాల్సిన పని లేదు.750 బెడ్స్. 250 ఎమర్జెన్సీ బెడ్స్ 1000 మంది డాక్టర్లు మీ కోసమే మనలాంటి సామాన్యులకు వైద్యం అందాలని 24 గంటలు అంకితభావంతో పనిచేస్తున్నారు. దేశం లో నుండి ఎక్కడ నుంచి వచ్చినా సరే, ఆధార్ కార్డు ఉంటే చాలు. తెలుగులోనే మాట్లాడతారు, ప్రేమగా ట్రీట్మెంట్ ఇస్తారు.ఇంకా ఆలోచిస్తున్నారా?మీ పక్కింటి వాళ్లు, మీ బంధువులు, మీతో పనిచేసే తోటి వర్కర్స్ ఎవరైనా జబ్బుతో బాధపడుతున్నారా? లక్షలకు లక్షలు అప్పు చేస్తున్నారా? వెంటనే ఈ మాట చెప్పండి: "ఒక్కసారి బీబీనగర్ ఎయిమ్స్ కీ వెళ్లిరాశీడి ."మీరు ఫార్వర్డ్ చేసే ఈ ఒక్క మెసేజ్ ఒక కుటుంబాన్ని అప్పుల ఊబి నుండి బయటకు లాగవచ్చు. ఒక తల్లి కన్నీళ్లు తుడవవచ్చు. ఒక నాన్న గుండె ధైర్యం నింపవచ్చు.ఇది కేంద్ర ప్రభుత్వ హాస్పిటల్ అని చులకన చేయకండి. ఇది మన ఆస్తి. మన కోసం కట్టిన ప్రపంచ స్థాయి హాస్పిటల్. దీన్ని పూర్తిగా వాడుకుందాం.అడ్రస్: ఎయిమ్స్ హాస్పిటల్, బీబీనగర్ హైదరాబాద్ (200 Acres)ఓపీ టైమ్: ఉదయం 9 నుండి. టికెట్ ₹10. aimsbibinager.edu. in online booking fecility 08685293300008685295050Am 9`5pmఈరోజే మీ ఫోన్లోని 10 గ్రూపులకు పంపండి. పుణ్యం మీకు, మేలు 10 మందికి.ఇట్లు, మీ శ్రేయోభిలాషి

